క్లుప్తంగా

రుణాలకు గడువు పెంచరూ !



ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పిస్తున్న యువకులు

నాగలాపురం: ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 10 తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. కానీ 7వ తేదీ నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోలేకపోయామని పలువురు యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్సీ రుణాలకు దరఖాస్తు గడువు పొడిగించాలని స్థానిక పడమటి దళితవాడకు చెందిన యువకులు మంగళవారం ఎంపీడీఓ బాలాజి నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు.

వైద్యాధికారిగా మురళీధర్‌రెడ్డి



బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిగా మురళీధర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దివాకర్ పీజీ సీటు రావడంతో వెళ్లిపోయారు. ఈయన స్థానంలో మురళీధర్‌రెడ్డి నూతన వైద్యుడిగా బదిలీపై వచ్చారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

కోర్టు ప్రాంగణంలో పార్కింగ్ నిషేధం

సత్యవేడు: స్థానిక జుడీషియల్ కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్‌ను సీఐ మురళీ నాయుడి ఆదేశాల మేరకు నిషేధం విధిస్తున్నట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. కోర్టు ముందు భాగంలో ప్రైవేటు వ్యక్తులు వాహనాల పార్కింగ్ అనుమతి లేదన్నారు. శ్రీసిటీ కంపెనీలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు కోర్టు ముందు భాగంలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని చెప్పారు. మరి కొందరు ద్విచక్రవాహనాలతో పాటు, కార్లు కూడా ఇక్కడ పార్కింగ్ చేయడం వల్ల కోర్టు కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. కోర్టు ఆవరణలో బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ చేస్తే చట్ట పరంగా కేసు నమోదు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలన్నారు.

చెట్టును ఢీకొన్న కంటైనరు



చింత చెట్టును ఢీకొన్న కంటైనరు లారీ

నాగలాపురం: చెట్టును కంటైనరు లారీ ఢీకొన్న ఘటన మండలంలోని అచ్చమ నాయుడు కండ్రిగ వద్ద మంగళవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఎస్ఐ సునీల్ కథనం ..బెంగళూరు నుంచి చెన్నైకి వెళ్తున్న ఖాళీ కంటైనరు లారీ అచ్చమనాయుడు కండ్రిగ వద్ద హైవే పక్కన ఉన్న చింత చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కంటైనరు ముందు భాగం మాత్రం దెబ్బతింది. డ్రైవరు నిద్ర మత్తులోకి జారుకోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

విధులు గాలికి.. కమీషన్లకు కక్కుర్తి..!

- దళారీ అవతారమెత్తుతున్న సెక్యూరిటీ గార్డులు
- ముక్కంటి ఆలయంలో గాడి తప్పుతున్న వ్యవస్థ
- అధికారుల పర్యవేక్షణ శూన్యం

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీ గార్డు వ్యవస్థ గాడి తప్పింది. పర్యవేక్షణ కొరవడం, సరైన శిక్షణ లేకపోవడంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం చోటుచేసుకున్న ఉదంతం దీనికి అద్దం పట్టింది. వివరాలు.. 4వ గేటు నుంచి ఆలయంలోకి వస్తున్న భక్తుల బృందానికి మంచి గది తీసిస్తానంటూ ఓ సెక్యూరిటీ గార్డు బేరం కుదుర్చుకున్నాడు. ఇంతలో ప్రైవేటు అతిథి గృహం బ్రోకర్లు దానికంటే మంచి గది చూపిస్తామంటూ వారిని ప్రైవేటు అతిథి గృహానికి తీసుకెళ్లిపోయాడు. దీనిపై ఆగ్రహించిన ఆ సెక్యూరిటీ గార్డు ఆ ప్రైవేటు అతిథి గృహం మేనేజర్‌తో గొడవకు దిగాడు. తాను మొదట ఆ భక్తుల బృందంతో మాట్లాడానని తనకు కమీషన్ ఇవ్వాలని వాదులాటకు దిగాడు. ఆలయ సెక్యూరిటీ గార్డుగా ఉండి ఆలయ అతిథి గృహంలో గదులు కాకుండా ప్రైవేటుగా చేయడం ఏమిటని ఆ అతిథి గృహం మేనేజర్ రివర్స్ అయ్యాడు. దీంతో రెచ్చిపోయిన ఆ సెక్యూరిటీ గార్డు..'నా ఇష్టం..చెప్పడానికి నువ్వెవరు?...ఎక్కడైనా గదులు తీసిస్తా..'' అతడిపై చిందులేశాడు. ఇది కాస్తా చర్చనీయాంశమైంది.



ప్రైవేటు అతిథి గృహ మేనేజర్‌తో వాగ్వాదం చేసిన సెక్యూరిటీ గార్డు

శివయ్యా!.. వీరిని దారిన పెట్టేదెవరయ్యా..?

శ్రీకాళహస్తి ఆలయంలో సెక్యూరిటీ గార్డులకు సరైన శిక్షణగానీ, ఇన్‌చార్జ్ అంటూ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని భక్తుల నుంచి ప్రధానంగా వస్తున్న విమర్శలు. ఆదివారం రాత్రి ఓ వ్యక్తి పూటుగా మద్యం సేవించి జ్ఞానప్రసూనాంబిక సదన్ ఎదురుగా ఉండే బల్లపై నిద్రిస్తూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనలో కూడా మద్యం సేవించిన వ్యక్తిని ఆలయంలోకి వచ్చినా ఎవరూ నిలువరించకపోవడం, ఇక్కడే పడుకుని చనిపోవడం చూస్తే భద్రతా వైఫల్యాలను చెప్పకనే చెప్పింది.

వీఐపీలు వస్తే అత్యుత్సాహం

సాధారణ భక్తులకు సరైన సేవలు చేయడం పక్కన పెట్టి, సినీ ప్రముఖులు వచ్చిన సమయంలో ఎగబడి వారితో సెల్ఫీలు తీసుకోవడం.. ఎవరైనా వీఐపీలు వస్తే వారి సేవలో తరించడానికి సిబ్బంది చూపే ఉత్సాహం చూస్తుంటే ఆలయ సెక్యూరిటీ వ్యవస్థ ఎలా ఉందో ఇట్టే బోధ పడుతుంది. వీరి మూలాన ఆలయ ప్రతిష్టలకు మకిలి అంటుతోంది. ఇకనైనా ఆలయ అధికారులు సెక్యూరిటీ గార్డుల వ్యవస్థను సరైన గాడిలో పెట్టే దిశగా శిక్షణ ఇచ్చి, అర్హత గల వారిని ఇన్‌చార్జులుగా నియమించి, పర్యవేక్షించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ధ్రువపత్రాలకు దరఖాస్తు సమయమిదే

- విద్యార్థులకు ముందుచూపు అవసరం గడువు ముగిసేవరకు వేచి చూడద్దు

వరదయ్యపాళెం: ఇంటర్మీడియట్, 10వ తరగతి తదితర పరీక్షా ఫలితాలు ఇటీవలే వెలువడ్డాయి. ఉన్నత చదువుల్లో భాగంగా కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు పలు ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటిని ముందస్తుగా పొందేందుకు ఇదే మంచి తరుణమని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థుల కోసం సంబంధిత కార్యాలయాల్లో అవసరమైన అన్ని పత్రాలు అందజేయడానికి అధికారులుఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రక్రియ ఇలా..

ప్రస్తుతం చదువుతున్న తరగతుల నుంచి తదుపరి తరగతుల్లోకి ప్రవేశానికి ఆదాయం, కుల, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటి కోసం విద్యార్థులు మీసేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్హత ధ్రువపత్రాలను ఆయా పరిధిలోని సచివాలయాల్లో డిజిటల్ సహాయకుడికి ఇస్తే ఆన్‌లైన్ చేస్తారు. తరువాత వీఆర్వో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను ఆన్‌లైన్ దరఖాస్తుకు జతచేసి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే మంజూరు నిమిత్తం తహసీల్దార్ ఆన్‌లైన్‌లో పంపుతారు. దరఖాస్తుకు సంబంధించిన అన్ని వివరాలు పరిశీలించిన తరువాత తహసీల్దార్ ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు. 2020–21 తరువాత ఎవరైనా కుల, ధ్రువీకరణ తీసుకుంటే దానిపై ఉన్న నెంబర్ ఆధారంగా మళ్లీ, తీసుకోవచ్చు. ఆదాయ ధ్రువపత్రాలు మాత్రం కొత్తగా దరఖాస్తు చేసుకుని తీసుకోవాల్సిందే.

ఒత్తిడి పెరగకముందే..

సాధారణంగా మే, జూన్ నెలల్లో ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బందిపై ధ్రువపత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. దరఖాస్తుదారుల రద్దీ పెరుగుతూ ఉంటుంది. వీఆర్వో, ఆర్ఐ క్షేత్రస్థాయి పరిశీలన, డిజిటల్ సంతకాలు తదితర పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో కార్యాలయాలకు పలుమార్లు తిరగాల్సిరావడం, మధ్యవర్తులను ఆశ్రయించడం వంటి ఇబ్బందులు రావచ్చు. ఫలితంగా అనుకున్న సమయానికి ధ్రువపత్రాలు చేతికి అందకపోవచ్చు. ముందుగా మేల్కొంటే హైరానా తప్పుతుందని అధికారులు చెబుతున్నారు.



వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం

దరఖాస్తు చేసుకోండి



కళాశాలలు, వృత్తి విద్యాకోర్సుల్లో చేరే సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను ముందుగా సిద్ధం చేసుకుంటే మేలు. చివరి సమయంలో హడావుడి పడుతూ ఆందోళన చెంద కుండా ప్రస్తుత సెలవుల్లోనే కార్యాలయాలను సంప్రదించాలి. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన సమయం కంటే ముందు వీటిని జారీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

–రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం

మధుసూదన్ రెడ్డి వెన్నంటే ఉంటాం..!



మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో మైనారిటీ నాయకులు

–స్పష్టం చేసిన మైనారిటీ నేతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమం కోసం ఇప్పటివరకు ఏ నాయకుడూ చేయని విధంగా అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేశారని, జీవితాంతం తామంతా ఆయన వెన్నంటే నడుస్తామని మైనారిటీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్, గోరా, మాబాషా, ఫజల్, గఫూర్, ఆరిఫ్, ఫిరోజ్, అస్లాం, బావాజీ, జిలాని, గౌస్ బాషా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై కూలీలకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: వేసవిలో మండే ఎండలతో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. ఆయన మంగళవారం కనమనంబేడు గ్రామంలోని చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు ఎక్కువ నమోదవుతుండడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటి పరిసరాలతోపాటు, వీధులను శుభ్రం ఉంచుకుంటే దోమల బెడద ఉండదని, తద్వారా జ్వరాలు రావని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధులబారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వేంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేస్తున్న వైద్యాధికారి విద్యాసాగర్

శ్రీసిటీ విద్యా సంస్థల విజయకేతనం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): దేశవ్యాప్తంగా మంగళవారం వెలువడిన సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయ, అకార్డ్ విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. చిన్మయా విద్యాలయ నుంచి పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 57 మంది విద్యార్థుల్లో 16 మంది డిస్టింక్షన్, 29 మంది ఫస్ట్ క్లాస్, 12 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఎస్.కవినాయ (93%), కె.జ్యోత్స్ని (88.8%), ప్రశాంత్ రాజ్ (87.2%) మార్కులతో టాపర్లుగా నిలిచారు. పన్నెండో తరగతి పరీక్షల్లో 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఆరుగురు డిస్టింక్షన్, మిగిలిన వారు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారు. వీరిలో కె.లోకేష్, ఎ.లోకేష్ రెడ్డి, ఎస్.చరణ్ వరుసగా 93%, 83.4%, 82.4% మార్కులతో టాపర్లుగా నిలిచారు. చిన్మయా విద్యాలయకు సంబంధించి వరుసగా 9వ సారి పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ కె.భువనేశ్వరి తెలిపారు. పన్నెండు తరగతి పరీక్షల్లో ఇది రెండవ బ్యాచ్ కాగా, ఇందులోనూ 100 శాతం ఫలితాలతో అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు వివరించారు.

అకార్డ్ స్కూల్‌కు సంబంధించి వరుసగా రెండో ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత పొందారు. ఉత్తీర్ణులైన 29 మందిలో 11 మంది డిస్టింక్షన్, 9 మంది ఫస్ట్ క్లాస్, 6 మంది సెకండ్ క్లాస్, ముగ్గురు థర్డ్ క్లాస్ పొందారు. ఆర్.ఎ.ఆమేక 92.6%, కళాత్మిక తులసి 92.4%, తాతా లోహిత 89% మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ బృందా ప్రకటించారు. మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తనప్రకటనలో అభినందనలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో తిరుపతి గంగజాతర

నారాయణవనం: తిరుపతి గంగ జాతరను పురస్కరించుకుని మంగళవారం మండలంలో వాడవాడలా గంగమ్మకు మొక్కులు చెల్లించుకుని అంబలి పంచిపెట్టారు. కీళగరం కలగూరమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలను నిర్వహించి చందన అలంకరణ చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో మొక్కులు చెల్లించుకుని అంబలి కుంభాన్ని సమర్పించారు. భక్తులకు, మహిళలకు అంబలిని వితరణ చేసి మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉంజల్‌సేవలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. తుంబూరు ఎల్లమ్మ ఆలయంలో, నారాయణవనంలో నడివీధి గంగమ్మ దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అంబలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



చందన అలంకరణలో కలగూరమ్మ

తప్పుడు ఆరోపణలతో పబ్బం గడుపుకోవద్దు

నాగలాపురం: తప్పుడు ఆరోపణలతో రాజకీయ పబ్బం గడుపుకోవడం టీడీపీ నేతలకు అలవాటేనని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అపరంజిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ప్రస్తుత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ పొందినట్లు మండలానికి చెందిన టీడీపీ నేత నెల్సన్ మండేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తాను 45 ఏళ్లుగా మండలంలో రాజకీయాల్లో ఉన్నానని అటు కాంగ్రెస్, ఇటు వైఎస్సార్‌సీపీలో సుదీర్ఘంగా మండల పార్టీ అధ్యక్షుడిగా నిబద్ధతతో పనిచేశానే తప్ప లాలూచీ రాజకీయాలకు ఏనాడు పాల్పడలేదని తెలిపారు. తప్పుడు ఆరోపణలపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. న్యాయపరంగా కూడా సంబంధిత వ్యక్తిపై పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు.

తిరుపతి ఐఐటీ అభివృద్ధికి మరిన్ని నిధులు

– మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేసింది. దేశంలోని తిరుపతి ఐఐటీ, కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ఐఐటీ, ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ ఐఐటీ, జమ్మూ ఐఐటీ, కర్ణాటక రాష్ట్రం దార్వాడ్ ఐఐటీలకు 2025–26 నుంచి 2028–29 నాలుగేళ్లకు రూ.11,828.79కోట్లు నిధులు మంజూరు చేసింది. అలాగే అదనంగా 130 ప్రొఫెసర్ స్థాయి బోధనా సిబ్బంది పోస్టులను అదనంగా భర్తీ చేయనుంది. రూ.2,100కోట్లతో తిరుపతి ఐఐటీని మొదటి తరం ఐఐటీగా అభివృద్ధి చేసే లక్ష్యంగా ఇప్పటికే పూర్తిస్థాయి నిర్మాణాలను పూర్తి చేసుకుంది. తిరుపతి ఐఐటీకి ప్రస్తుతం కేటాయించిన రూ.2,100 నిధులతో తిరుపతి ఐఐటీని ప్రపంచస్థాయి వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. అలాగే విద్యార్థుల పరిశోధనలకు అనుగుణమైన పరిస్థితులను ఐఐటీ ప్రాంగణంలో కల్పించనున్నట్లు ఆయన చెప్పారు.

మారెమ్మకు పొంగళ్లు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. ఎల్లమండ్యం ఎస్సీ కాలనీలో కొలువు దీరిన మారెమ్మకు అభిషేకం అనంతరం గ్రామస్తులు అంబలి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఊరి పొలిమేర్లలో పొంగళ్లు పెట్టారు. రేణిగుంట గంగమ్మ దేవాలయంలో మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి వెదురు పొంగళ్లు పెట్టారు. అలాగే, గురవరాజుపల్లె బీసీ కాలనీలో జాతర సంబరాలు ఘనంగా నిర్వహించారు.





పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు (ఇన్‌సెట్) అలంకరణలో మారెమ్మ

నోటీస్ బోర్డు

ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- శ్రీకాళహస్తి: పట్టణంలోని బాలసదనంలో ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ప్రాతిపదికన ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూపరింటెండెంట్ మంగళవారంఓ ప్రకటనలో కోరారు. బాలసదనంలో కుక్–2 పోస్టులు, హెల్పర్, హెల్పర్ కం నైట్ వాచ్‌మన్, ఎడ్యుకేటర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9000106774 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సింహ వాహనంపై కల్యాణ వెంకటేశ్వరుడు



సింహ వాహనంపై యోగముద్రలో దినకరునిగా..



ముత్యపు పందిరి వాహనంలో పార్థసారథిగా ..

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం జగతికి వెలుగునిచ్చే దినకరుని అవతారంలో సింహ వాహనాన్ని అధిరోహించిన కల్యాణ వెంకటేశ్వరుడు రాత్రి కృష్ణావతరంలో సర్వభూపాల వాహనంలో ఉభయ నాంచారులతో గ్రామోత్సవాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన నిత్యపూజలు, ప్రత్యేక హోమాలను పూర్తి చేశారు. ఉదయం 7.30 గంటలకు వెలుగును నింపే దినకరునిగా యోగముద్రలో సూర్యదేవునిగా సింహ వాహనంపై సుగంధ పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలను అలంకరించుకున్న స్వామి అధిష్టించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాల మధ్య గోవింద నామ స్మరణలతో స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులు ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేద తీరారు.

ముత్యపుపందిరిలో పార్థసారథి

కురుక్షేత్రంలో పార్థునికి జ్ఞానబోధ చేసిన శ్రీకృష్ణావతారంలో రుక్మిణీ సమేతుడై ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. గంట పాటు వేద, నాద, గాత్ర కచేరీతో ఊంజల్‌సేవలో దేవదేవేరులు దర్శనమిచ్చారు. రాత్రి 7.30 గంటలకు ముత్యాలతో, సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా ఆంకరించిన ముత్యపు పందిరి వాహనంలో ఉత్సవర్లు ఊరేగింపుగా బయలుదేరారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించిన అర్చకులు భోగశ్రీనివాసునికి పవళింపు సేవను నిర్వహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య, శ్రీనివాస రాఘవ భట్టాచార్య, నరసింహ భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



విద్యుద్దీపాల శోభతో కాంతులీనుతున్న ఆలయం



కల్యాణం..కమనీయం

శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన చెన్నకేశవుని కల్యాణోత్సవానికి ముక్కంటి ఆలయ ఈఓ టి.బాపిరాజు దంపతులు ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ, భక్తజన సందడి నడుమ కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బొజ్జల సురేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. – రేణిగుంట



పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న శ్రీకాళహస్తి ఆలయ ఈఓ బాపిరెడ్డి







విశేష అలంకరణలో స్వామి,అమ్మవార్లు

ఏర్పేడులో ఘనంగా గంగమ్మ కొలుపు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు గొల్లవీధిలో మంగళవారం గంగమ్మ కొలుపు ఉత్సవం వేడుకగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ వద్ద వేపాకు పందిరి వేసి, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఉదయం భక్తులు అంబలి పోసి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ప్రతిమ ముగ్గు వేశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రి కొలుపు ఉత్సవం సందర్భంగా గంగపెట్టె, పోతురాజును డప్పు నృత్యాల నడుమ ఊరేగించారు. గ్రామ పెద్దలు జల్లి కృష్ణయ్య యాదవ్, బొడుగు చిన్నవెంకట్రాయులు, బొడుగు గురవయ్య, అక్కుపల్లి లక్ష్మయ్య, జల్లి రమణయ్య, జల్లి చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడు గొల్లవీధిలో ముగ్గుతో వేసిన అమ్మవారి ప్రతిమ